సాక్షి
పార్వతీపురం మన్యం

బుధవారం । 21 । ఆగస్టు । 2024



పీవీటీజీల అభివృద్ధే ధ్యేయం

ప్రిమిటివ్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్ (పీవీటీజీ)ల సమీకృత అభివృద్ధే ధ్యేయం కావాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు.

- 8లో



మళ్లీ చదువుకుందాం..!

చదువుకు దూరమైన వారు మళ్లీ చదువుకునేందుకు ఏపీ సార్వత్రిక విద్యా పీఠం మళ్లీ చదువుకుందాం..రా..అంటూ ఆహ్వానిస్తోంది.

- 8లో

సింగనాపురంలో ఏనుగులు



జియ్యమ్మవలస: మండలంలోని సింగనాపురం పంట పొలాల్లో మంగళవారం ఏనుగుల గుంపు సంచరిస్తోంది. వారం రోజుల నుంచి చుట్టుపక్కల గ్రామాలైన చినకుదమ, గౌరీపురం తదితర ప్రాంతాల్లో సంచరించిన ఏనుగులు సింగనాపురం చేరుకున్నాయి. దీంతో పొలాలకు వెళ్లేందుకు రైతులు భయపడుతున్నారు.

న్యూస్‌రీల్

నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్

పార్వతీపురంటౌన్: జిల్లాకేంద్రం పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన జాబ్ మేళాలో అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రిక్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొని 62 మంది ఇంటర్వ్యూలు నిర్వహించగా 29 మంది అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు, 18 మంది రిక్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎంపికయ్యారు. అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత స్థాయికి చేరాలనే అకుంఠిత దీక్షతో పనిచేయాలని అభ్యర్థులకు హితవు పలికారు. నిర్దిష్ట లక్ష్యం, ఆశయంతో జీవితానికి సోపానాలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయి కుమార్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశ్రామికంగా గుర్తించాలి

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాను పర్యాటక, ఆతిథ్య రంగంలో పారిశ్రామికంగా గుర్తించేందుకు సహకరించాలని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్‌ను పారిశ్రామిక రంగ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నూతన పారిశ్రామిక విధానం సేవారంగాలకు పెట్టుబడి రాయితీ, స్టాంప్ డ్యూటీ, విద్యుత్ రాయితీ, భూమార్పిడి, జీఎస్టీ, వడ్డీ రాయితీ తదితర అంశాలలో ప్రభుత్వం రాయితీ కల్పించిందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు 45శాతం నుంచి వందశాతం వరకు రాయితీ కల్పించనున్నామన్నారు. పారిశ్రామిక రంగ ప్రతినిధి టీపీఎస్ రామ్మోహనరావు మాట్లాడుతూ సింగిల్ విండో విధానంలో అన్ని అనుమతులు పూర్తి చేయాలని, నిరభ్యంతర పత్రాలను ఐదు సంవత్సరాల కాల వ్యవధికి జారీ చేయాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లా పరిశ్రమల కేంద్రంలో బిజినెస్ సెంటర్ ఏర్పాటు చేసి పారిశ్రామిక సందేహాల నివృత్తి, సూచనలు తెలియచేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎంవీ కరుణాకర్, సహాయ సంచాలకుడు పి.సీతారాంతో పాటు వివిధ పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య

- మరణంలోనూ వీడిపోని అనుబంధం



అక్కాచెల్లెళ్ల మృతదేహాలు

పాచిపెంట: అమాయక గిరిజన అక్కాచెల్లెళ్ల మధ్య చిన్ననాటి నుంచి పెనవేసుకున్న అనుబంధం చావులోనూ కొనసాగింది. చిన్నమ్మ, పెద్దమ్మ పిల్లలు వరుసకు అక్కాచెల్లెళ్లయిన వారిద్దరూ చిన్నప్పటి నుంచి కలిసే గ్రామంలో పెరిగారు. క్షణికావేశంలో వారు తీసుకున్న నిర్ణయం కుటుంబాలతో పాటు పరిసర గిరిజన గ్రామాల్లోను బాధను మిగిల్చింది. వివరాల్లోకి వెళ్తే.. పాచిపెంట మండలంలోని బొర్రమామిడి పంచాయతీ బొడ్డపాడు గ్రామానికి చెందిన సేబి సోంబారమ్మ(24)కు అదే గ్రామానికి చెందిన ఓ యువకుడితో వివాహం నిశ్చయమైంది. అయితే వారి మధ్య మనస్పర్థలు రావడంతో పెళ్లి ఆగిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన సాంబారమ్మ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని తన పిన్ని కూతురు పోయి లక్ష్మి(18)కి ఈ విషయం చెప్పింది. చిన్ననాటి నుంచి ఇద్దరం కలిసే పెరిగామని, ఇప్పుడూ కలిసే చనిపోదామని వారిద్దరూ నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి గ్రామ సమీపంలో ఉన్న నేలబావి వద్దకు వెళ్లి..చున్నీతో ఇద్దరూ చేతులు కట్టుకుని బావిలోకి దూకేశారు. మంగళవారం ఉదయం బావిలో వారి మృతదేహాలను గుర్తించిన స్థానికులు, వారి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను వెలికితీయించి సాలూరు ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సోమవారం రాత్రి వరకు కళ్ల ముందు ఉన్న పిల్లలు విగతజీవులుగా మారడంతో మృతుల తల్లిదండ్రులు గంగయ్య, చంద్రమ్మ, అమ్మన్న, పారమ్మలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. గిరిజన గూడల్లో విషాదం అలుముకుంది.

పచ్చని స్నేహం

- కలకాలం చెదిరిపోకుండా..
- మొక్కలు నాటి సంరక్షిస్తూ..
- ఉన్నత పాఠశాలలో నిలిచిపోనున్న మిత్రబంధం
- విద్యార్థులను అభినందిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలు



అలల ప్రయాణం తీరం చేరేవరకే.. కలల ప్రయాణం మెలకువ వచ్చేంత వరకే.. ప్రేమ ప్రయాణం పెళ్లి జరిగినంత వరకే.. కానీ స్నేహ ప్రయాణం ప్రాణమున్నంత వరకూ అని నిరూపిస్తున్నారు సీతానగరం మండలంలోని గాదెలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు. తమను వీడిపోయిన స్నేహితురాలు జీవితాంతం చెదిరిపోని జ్ఞాపకంలా గుర్తుండిపోవాలని చదువుకున్న పాఠశాలలో మొక్కలు నాటి సంరక్షిస్తూ పచ్చని మిత్రబంధానికి ఆనవాళ్లుగా నిలుస్తున్నారు.

సాక్షి, పార్వతీపురం మన్యం: అమ్మానాన్నలను, భార్యాభర్తలను ఆ దేవుడే నిర్ణయిస్తాడంటారు. మరి స్నేహితులను..దేవుడు మనకే వదిలేశాడు. రక్త సంబంధాలను ముందుగానే నిర్ణయించిన ఆ విధాత.. ఆత్మబంధాన్ని కలుపుకోమని మనకే అనుమతిచ్చేశాడు. అందుకే స్నేహితులు అచ్చంగా మనవారు.. మనసెరిగిన వారు. చిన్నప్పుడు పడిపోతే నాన్న పట్టుకుంటాడు. ఆకలేస్తే అమ్మ కమ్మగా గోరుముద్దలు పెడుతుంది. ఆమె లేనప్పుడు స్నేహితులే అమ్మ స్థానాన్ని భర్తీ చేసేది. అందుకే 'ఫ్రెండ్ ఈజ్ ఈక్వల్ టు ఆల్ రిలేషన్స్' అంటారు. బాధల నుంచి బయట పడేందుకు కొందరు దేవుడిని మొక్కుతారు. కానీ, ఈ నేస్తాలు తమ ప్రియ నేస్తం దూరమైన బాధ నుంచి బయట పడేందుకు, ఆమె రూపాన్ని మొక్కల్లో చూసుకుంటున్నారు. రేపు ఆ మొక్కలు.. మహా వృక్షాలై, ఎంతోమంది ఆ తల్లి ఒడిలో అక్షర బ్రహ్మలు కావాలని ఆ హితుల ఆకాంక్ష.

ఆ రోజున.. ఆ విషాదం

సీతానగరం మండలం ఆవాలవలస గ్రామానికి చెందిన ఆవాల శ్రావణి అదే మండలం గాదెలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదివేది. తమ గ్రామం నుంచి తోటపల్లి కెనాల్ మీదుగా ప్రతిరోజూ సైకిల్‌పై పాఠశాలకు రాకపోకలు సాగించేది. శ్రావణి చాలా కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతుండేది. ఈ క్రమంలో 2023, జూలై 18న పాఠశాలకు వస్తుండగా.. కెనాల్ వద్ద అకస్మాత్తుగా మూర్ఛకు గురైంది. దీంతో గిలగిలా కొట్టుకుంటూ గట్టు నుంచి నీటిలోకి పడిపోయింది. చాలా సేపటి వరకు అటుగా ఎవరూ రాకపోవడంతో పరిస్థితి విషమించి మృతిచెందింది. ఎప్పుడూ నవ్వుతూ, చలాకీగా ఉండే శ్రావణి.. ఇంక తమ మధ్యన లేదన్న విషయాన్ని తోటి విద్యార్థులు జీర్ణించుకోలేకపోయారు. కాలం గడచినా, ఆమె జ్ఞాపకాల నుంచి బయట పడలేకపోయారు. దీంతో అంతా కలసి ఓ నిర్ణయానికి వచ్చారు.

'పచ్చని' ప్రేమ

శ్రావణి జ్ఞాపకార్థం కలకాలం నిలిచిపోయేలా, భవిష్యత్ తరాలకు మేలు కలిగేలా బృహత్తర కార్యక్రమాన్ని తలపెట్టాలని తోటి విద్యార్థులంతా నిర్ణయించారు. పాఠశాల ఆవరణలో వంద మొక్కలు నాటాలని అనుకుంటున్నట్టు పాఠశాల హెచ్‌ఎం శంకరరావు దృష్టికి తీసుకువచ్చారు. మొక్కలు నాటడం ఒక ఎత్తయితే.. వాటిని సంరక్షించడం మరో ఎత్తు. విద్యార్థుల నిర్ణయాన్ని అభినందిస్తూనే.. దాన్ని ఆచరణలో పెట్టడంలో ఎదురయ్యే సవాళ్లను హెచ్‌ఎం వివరించారు. ఆ సంరక్షణ బాధ్యతలను తామే చూసుకుంటామని.. తమ ప్రాణంగా మొక్కలను భావిస్తామని విద్యార్థులంతా ముక్తకంఠంగా చెప్పడంతో ఉపాధ్యాయులు, గ్రామస్తులు వారి నిర్ణయాన్ని స్వాగతించారు.

> "మన్నించు.. నేస్తం! నీ కష్టం తెలిసి ఎల్లప్పుడూ నీ వెంటే ఉండేవాళ్లం. ఆ రోజు ఏ పని వచ్చి పడిందో గానీ.. మా కంటే ఒకడుగు నువ్వే ముందైపోయావ్. ఆ ముందు కాస్త ఈ లోకం నుంచి నిన్ను మాకు దూరం చేసేటంత అవుతుందని, ఆ క్షణం మేమెవరమూ ఊహించలేకపోయాం. లేకుంటే నీ చేతిని విడిచిపెట్టేవారం కాదేమో!! నువ్వు మమ్మల్ని వదిలి ఏడాదవుతున్నా..నీ నవ్వు, నీ అల్లరి, ఆ అమాయకత్వం ఇప్పటికీ మా మనస్సులను తాకుతూనే ఉన్నాయ్. అవి ఎప్పటికీ అలానే ఉండిపోవాలి. మాతోపాటు..మనం కలిసి చదివిన ఆ చదువుల తల్లి ఒడిలో 'నీడ'నై నీవెప్పుడూ పది కాలాలు 'పచ్చ'గా ఉండిపోవాలి."



గాదెలవలస జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో శ్రావణి జ్ఞాపకార్థం మొక్కలు నాటుతున్న పదో తరగతి విద్యార్థినులు



మొక్కలు నాటే కార్యక్రమం ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న విద్యార్థినులు (ఫైల్)

తొలి సంస్మరణ దినం సందర్భంగా..

శ్రావణి తొలి సంస్మరణ దినం సందర్భంగా ఈ ఏడాది జూలై 18న గాదెలవలస ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులు వంద మొక్కలను నాటే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానిక గ్రామ పెద్ద మొక్కల సంరక్షణకు అయ్యే మట్టిని సొంత ఖర్చుతో పోయించారు. ప్రతిరోజూ నీటి తడులను అందించేలా సొంత వ్యయం కొంత వెచ్చించి హెచ్‌ఎం పైపు ఏర్పాటు చేశారు. ఆయాలతో పాటు ఖాళీ సమయాల్లో విద్యార్థులు ఈ మొక్కల సంరక్షణను చేపడుతున్నారు. ఇదీ.. మిత్రురాలి కోసం.. ఓ మిత్రబృందం చేస్తున్న పచ్చని దృఢమైన సంకల్పం. నేడు వీరు నాటిన మొక్కలు రేపు మహా వృక్షాలై, అవే చెట్ల కింద ఎంతో మంది విద్యార్థులు చదువుకుని ఉన్నత స్థానాలకు వెళ్లాలని.. వారి ఉజ్వల భవిష్యత్తులో తమ స్నేహితురాలి సంతోషాన్ని చూడాలన్నది అందరి అభిమతమని ఆ స్నేహితులు ఆనందంగా చెబుతున్నారు.

'మా స్నేహితురాలికి గుర్తుగా..



కలసి చదువుకున్నాం. ఒక్కసారిగా మా నుంచి దూరమైపోయింది. ఆ బాధ నుంచి బయటపడటానికి చాలా రోజులు పట్టింది. ఆమె కోసం ఏదైనా మంచి పని చేయాలని అనుకున్నాం. ఉపాధ్యాయులతో చర్చిస్తే మొక్కల ఆలోచన వచ్చింది. ఆలోచనలో పెట్టాం. ఆ మొక్కల్లో తనను చూసుకుంటాం.

– గొంగాడ యామాని, పదో తరగతి, గాదెలవలస పాఠశాల

ఆ మొక్కలే మా నేస్తం



వాటిని మొక్కలుగా ఎప్పుడూ భావించడం లేదు. మా స్నేహితురాలు శ్రావణిగా చూసుకుంటున్నాం. ఆమె జ్ఞాపకార్థం అందరి ఆలోచనగా మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నప్పుడు ఉపాధ్యాయులు మమ్మల్ని ప్రోత్సహించారు. వాటిని నాటడమే కాదు.. కాపాడుకోవడంలోనే మా బాధ్యత ఉంది.

– జమ్ము చరణ్, పదో తరగతి, గాదెలవలస పాఠశాల

వారి ఆలోచన గొప్పది..



చిన్నవారైనా.. తోటి విద్యార్థిని మరణాన్ని తట్టుకోలేక, వారు తీసుకున్న నిర్ణయం చాలా గొప్పది. అందులో పర్యావరణ రక్షణ ఉండటం అన్నది ముఖ్యమైనది. గత జులైలో పాఠశాల ఆవరణలో వంద మొక్కలను విద్యార్థులంతా కలిసి నాటారు. నిత్యం ఆయాలతో కలసి, వాటి సంరక్షణ బాధ్యతలను చూసుకుంటున్నారు. ఇటువంటి విషయాలే సమాజం పట్ల విద్యార్థులకు బాధ్యతలను మరింత పెంచుతాయి. నైతిక విలువలు నేర్పుతాయి.

– ఎం.శంకరరావు, హెచ్‌ఎం, జడ్పీహెచ్‌ఎస్, గాదెలవలస

మా బాధ్యతగానూ భావిస్తున్నాం



శ్రావణి మృతి మా అందరికీ బాధాకరమే. అందుకే విద్యార్థులు మొక్కలు నాటాలన్న ఆలోచనతో వస్తే తొలుత అందరమూ ఆశ్చర్యపోయాం. ఆ తర్వాత వారి నిర్ణయాన్ని అభినందిస్తూ స్వాగతించాం. వాటి సంరక్షణలో మా బాధ్యత కూడా ఉంది. మేం కూడా ఆ మొక్కలను మా బిడ్డలా చూసుకుంటున్నాం.

– ఎస్.వి.రమణమూర్తి, బయాలజీ ఉపాధ్యాయులు

మానవత్వంతో స్పందించమని కోరా

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: మానవత్వంతో స్పందించమని తాను కోరితే చౌకబారు విమర్శలు చేశాననడం విడ్డూరంగా ఉందని, అలాంటి అలవాటు తనకు లేదని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పట్టణంలోని తన స్వగృహంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం పాచిపెంట మండలంలో కొటికిపెంట ఏకలవ్యపాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు మృతిచెందిన ఘటనలో తాను ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావుతో కలిసి పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఉన్న మృతదేహాల వద్దకు వెళ్లి, వారి బంధువులను పరామర్శించి ఓదార్చామని గుర్తుచేశారు. వృత్తిరీత్యా మన ప్రాంతానికి వచ్చి విగతజీవులైన ఆ ఉపాధ్యాయుల మృతదేహాలను వారి రాష్ట్రానికి తరలించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని మాత్రమే తాను కోరానని పేర్కొన్నారు. తన కంటే ముందు సంధ్యారాణి ఆ మృతదేహాల వద్దకు వెళ్లారని, ఆ మృతదేహాల తరలింపు విషయం ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మానవత్వంతో స్పందించాలని కోరిన, తన మాటలను చవకబారు విమర్శలంటూ మంత్రి సంధ్యారాణి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

ఎస్సైలకు స్థానచలనం

పార్వతీపురం టౌన్: జిల్లాలో ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వు లేరకు ఎస్సైల బదిలీ వివరాలిలా ఉన్నాయి.

పేరు	ప్రస్తుత ప్రదేశం	బదిలీ అయిన ప్రదేశం
వై. సిహాచలం	ఎస్పీ పార్వతీపురం	బలిజిపేట
పి.పాపారావు	బలిజిపేట వీఆర్,	పార్వతీపురం మన్యం
ఎంవీ రమణ	సాలూరు రూరల్	సాలూరు టౌన్ ఎస్సై-1
కె. వెంకట సురేష్	సాలూరు టౌన్ ఎస్సై-1	సాలూరు రూరల్
కె. సీతారాములు	సాలూరు టౌన్ ఎస్సై-2	మక్కువ
పి. నరసింహమూర్తి	మక్కువ	పాచిపెంట
పి. నారాయణరావు	పాచిపెంట వీఆర్,	పార్వతీపురం మన్యం
జి. శ్రీనివాసరావు	వీఆర్, పార్వతీపురం మన్యం	కొటియా పీఎస్
కె. ప్రయాగ మూర్తి	దిశ సెల్, పార్వతీపురం మన్యం	పాలకొండ పీఎస్
జి. కళాధర్	సీసీఎస్, పార్వతీపురం	వీరఘట్టం
ఎస్ ప్రశాంత్	పాలకొండ వీఆర్,	పార్వతీపురం మన్యం
డి. అనిల్ కుమార్	దోనుబాయ్	బత్తిలి
వై. అమ్మన్నరావు	గరుగుబిల్లి వీఆర్,	పార్వతీపురం మన్యం
పి. రమేష్ నాయుడు	వీఆర్, పార్వతీపురం మన్యం	గరుగుబిల్లి పీఎస్
ఎం. గోవింద	వీఆర్, పార్వతీపురం మన్యం	పార్వతీపురం టౌన్ ఎస్సై-2
బి. రవీంద్ర రాజు	పార్వతీపురం టౌన్ ఎస్సై-2	దిశ సెల్
ఐ. రాజా రావు	వీఆర్, పార్వతీపురం మన్యం	దిశ సెల్
ఎంఎస్‌వీ ప్రసాద్	వీఆర్, పార్వతీపురం మన్యం	ఎస్పీ పార్వతీపురం
విజి. శంకర్రావు రావు	వీఆర్, పార్వతీపురం మన్యం	ఎస్పీ పార్వతీపురం
జె. సత్యనారాయణ	వీఆర్, పార్వతీపురం మన్యం	డీసీఆర్‌బీ, పార్వతీపురం
ఎం. సూర్యా రావు	వీఆర్, పార్వతీపురం మన్యం	సీసీఎస్,
పి. తిరుపతి రావు	వీఆర్, పార్వతీపురం మన్యం	సీసీఎస్,
వి. శ్రీనివాస రావు	వీఆర్, పార్వతీపురం మన్యం	సీసీఎస్
డి. సూర్యనారాయణ	వీఆర్, పార్వతీపురం మన్యం	పీసీఆర్

షాడో లీడర్స్!

- అధికార కార్యక్రమాల్లో టీడీపీ కార్యకర్తల హల్‌చల్
- నాటి జన్మభూమి కమిటీలను తలపిస్తున్న తీరు
- సభలు, వినతుల కార్యక్రమాల్లోనూ హవా
- అధికారుల విధుల్లోనూ హద్దులుమీరి జోక్యం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కిట్‌లు, పుస్తకాలను గత ప్రభుత్వ పాలనలో అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రమే అందించేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ విధానం మార్చేశారు. సాధారణ టీడీపీ కార్యకర్తలు కూడా వేదికలెక్కి పుస్తకాలు అందించడం చూసి విద్యార్థుల తల్లిదండ్రులు ముక్కున వేలేసుకున్నారు. నెల్లిమర్ల, పాలకొండ నియోజకవర్గాల్లో అయితే మేమిస్తామంటే మేమిస్తామంటూ టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు వాదులాడుకోవడం చూశాం. ఇది కాస్త ముదిరిపోయింది. అధికారులతోనే వేదికపై కూర్చొంటున్నారు. కలెక్టరేట్‌ల్లోకి సైతం చొరబడి ప్రజల నుంచి వారే ముందుగా వినతులు తీసుకొని పరిశీలించేస్తున్నారు. చిరు ఉద్యోగుల నుంచి మండల స్థాయి ఉద్యోగుల వరకూ ఎవరు ఉండాలో, ఎవరిని తీసేయాలో తీర్పులిచ్చేస్తున్నారు. ఈ తీరు చూస్తుంటే మళ్లీ గత టీడీపీ ప్రభుత్వ కాలం నాటి జన్మభూమి కమిటీలు గుర్తొస్తున్నాయని ప్రజలు విస్తుపోతున్నారు. తమ విధుల్లోనూ హద్దుమీరి జోక్యం చేసుకుంటున్నా అధికారులు కూడా మిన్నకుండిపోతున్నారు. వద్దని వారించే ధైర్యం చేయలేకపోతున్నారు.



పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) పనుల గుర్తింపు కోసం గత శనివారం జరిగిన సమావేశం తాలూకా చిత్రం ఇది. ప్రోటోకాల్ ప్రకారం వేదిక ఎక్కడానికి ప్రజాప్రతినిధులకు, అధికారులకు మాత్రమే అవకాశం ఉంటుంది. అది సంప్రదాయం కూడా. కానీ ఆ వేదికపై పసుపు చొక్కా వేసుకొని మైక్‌లో ప్రసంగిస్తున్న వ్యక్తి అధికారీ కాదు ప్రజాప్రతినిధి కూడా కాదు. అసలుసిసలైన టీడీపీ చిన్నస్థాయి నాయకుడు పల్లా రాంబాబు. అతను టీడీపీ మండల కన్వీనరు మాత్రమే. ఇలాంటి సమావేశాల్లో వేదికపై కూర్చోవడానికి అతనికి ఏమాత్రం అర్హత లేదు. అతనొక్కడే కాదు అదే వేదికపై కూర్చొన్నవారిని ఎడమవైపు నుంచి గమనిస్తే వరుసగా ఏపీవో శ్రీనివాసరావు (ఎరుపు చొక్కా), టీడీపీ మండల నాయకుడు దొంకాడ రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు దత్తి లక్ష్మణరావు, ఎంపీపీ బొంగు సురేష్, ఎంపీడీవో శ్రీనివాసరావు (టోపీ పెట్టుకున్న వ్యక్తి) ఉన్నారు. ఇలాంటి అధికారిక కార్యక్రమాల్లో వేదికపై కూర్చొనే అర్హత వారిలో ఏపీవో, ఎంపీపీ, ఎంపీడీవోలకు మాత్రమే ఉంది. కానీ 'ఉపాధి' పనులు గుర్తింపు పేరుతో వేదికపైకి ఆ టీడీపీ నాయకులు ముగ్గురూ చేరిపోయారు. అధికారుల విధి నిర్వహణలో అనవసర జోక్యం చేసుకుంటూ షాడో నేతలుగా చక్రం తిప్పుతున్నారు.



అధికారిక కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు దత్తి లక్ష్మణరావు





మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెనుక టీడీపీ నాయకులు

విజయనగరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గత సోమవారం జరిగిన 'ప్రజావినతుల పరిష్కార వేదిక' కార్యక్రమం తాలూకా చిత్రమిది. వాస్తవానికి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతూ వస్తోంది. ప్రజల దగ్గర నుంచి వారే వినతులు స్వీకరిస్తుంటారు. కానీ కూటమి ప్రభుత్వంలో మంత్రులు కూడా ఈ కార్యక్రమానికి వస్తున్నారు. అందులో భాగంగా రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరయ్యారు. మంత్రి హోదాలో ప్రజల నుంచి స్వీకరించవచ్చు. కానీ మంత్రి కన్నా ముందు ఆయన బంధువులు, టీడీపీ కార్యకర్తల హడావుడి ఎక్కువైపోయింది. వారే ప్రజల నుంచి వినతులు తీసుకొని పరిశీలిస్తున్నారు. వారికి అనుకూలంగా ఉంటే ఆన్‌లైన్‌లో నమోదుచేయించి ఆ తర్వాత మంత్రి దగ్గరకు తీసుకెళ్తున్నారు. ఏమాత్రం తేడాగా వినతిపత్రం ఉన్నా మంత్రి, కలెక్టర్ పరిశీలనకు వెళ్లనీయకుండా వెనక్కు పంపించేస్తున్నారు. ఇలా హడావుడి చేసినవారిలో టీడీపీ మండల స్థాయి నాయకుడు మక్కువ శ్రీధర్ (చిత్రంలో కళ్లద్దాలు ధరించిన వ్యక్తి) ముందున్నారు. మంత్రి బంధువైన కొండపల్లి భాస్కర్, మరికొంతమంది గజపతినగరం టీడీపీ నాయకులు కూడా ఆ కార్యక్రమంలో హల్‌చల్ చేయడం గమనార్హం. వారిని జిల్లా అధికారులు గమనించినా వారించకుండా మిన్నకుండిపోయారు.

క్లుప్తంగా

'ఇన్‌స్పైర్' ప్రాజెక్టులు నమోదు చేయండి

• డీఈఓ ఎన్. ప్రేమకుమార్



మాట్లాడుతున్న డీఈఓ ఎన్.ప్రేమకుమార్

విజయనగరం అర్బన్: ఇన్‌స్పైర్ మానక్ పోటీల కోసం ప్రాజెక్టులు నమోదు చేయాలని డీఈఓ ఎస్.ప్రేమకుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక పీఎస్ఆర్ స్కూల్‌లో జరిగిన సైన్స్ టీచర్ల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి ప్రాజెక్టులను ఈ నెల చివరి లోగా నమోదు చేయాలని పిలుపునిచ్చారు. అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో గల ఉన్నత పాఠశాలల నుంచి ఐదు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు ప్రాజెక్టులు చొప్పున నమోదు చేయాలని తెలియజేశారు. ఆన్‌లైన్‌లో ప్రాజెక్టులను అప్‌లోడ్ చేయడంపై వివరించారు. జిల్లా సైన్స్ అధికారి మిరియాల కృష్ణారావు అధ్యక్షతన ఒక రోజు ఓరియంటేషన్ సదస్సు జరగ్గా రిసోర్స్ పర్సన్‌లుగా ఎస్.ఉమామహేశ్వరరావు, టి.రాజేష్, 300 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోంగార్డులుగా కారుణ్య నియామకపత్రాలు



నియామకపత్రాలను అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో హోంగార్డు విభాగంలో పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన ఇద్దరు హోంగార్డ్స్ కుటుంబాలకు కారుణ్య నియామకాల్లో భాగంగా వారి సతీమణులను హోంగార్డులుగా నియమిస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో మృతిచెందిన హోంగార్డ్స్ కుటుంబాలను ఆదుకోవడంలో భాగంగా వారి కుటుంబంలోని ఇద్దరు మహిళలను పోలీస్‌శాఖలో హోంగార్డులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశామన్నారు. ఇటీవల కరెంట్ షాక్‌కు గురై మృతిచెందిన హోంగార్డ్ జి.వెంకట సత్యం సతీమణి జి.పార్వతికి, అలాగే ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు ఎస్.చిన్నోడు సతీమణి ఎం.రజనిలను హోంగార్డులుగా నియమించి, నియామక ఉత్తర్వులను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రమేష్ కుమార్, డీపీఓ పర్యవేక్షకులు ప్రభాకరరావు, ఆర్ఎస్సై షేక్ అలీ, ఇతర పోలీసు అధికారులు, హోంగార్డ్స్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అవగాహనతో వ్యాధులు దూరం


• డీఎంహెచ్ఓ కె.విజయ పార్వతి



సర్ రోనాల్డ్ రాస్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న డీఎంహెచ్ఓ కె.విజయ పార్వతి

పార్వతీపురం టౌన్: దోమల వ్యాప్తిని అరికట్టడానికి పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయ పార్వతి అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మలేరియా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సర్ రోనాల్డ్ రాస్ చిత్ర పటానికి డీఎంహెచ్ఓ, వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, ఫైలేరియా వ్యాధులు సోకడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత, డ్రైడే పాటించాలని తద్వారా ఇలాంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని హితవు పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి రఘుకుమార్, నోడల్ అధికారి ఎం.వినోద్, వీబీడీ కన్సల్టెంట్ రామచంద్ర, డెమోలు యోగీశ్వరరెడ్డి, సన్యాసిరావు, మలేరియా కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



శంకరరావు(ఫైల్)

పాచిపెంట: గడ్డి మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పాచిపెంట మండలంలోని పాంచాలి గ్రామంలో జరిగిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. ,గ్రామానికి చెందిన మహిచర్ల శంకరరావు(22) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 15న ఆటో రిపేర్‌కు డబ్బులివ్వాలని అడిగిన క్రమంలో తల్లిదండ్రులతో చిన్నపాటి వివాదం నెలకొంది. దీంతో మనస్తాపానికి గురైన శంకరరావు గడ్డి మందు తాగేశాడు. వెంటనే తల్లిదండ్రులు విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹118	₹206	₹216

పీవీటీజీల అభివృద్ధే ధ్యేయం

• కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రిమిటివ్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్ (పీవీటీజీ)ల సమీకృత అభివృద్ధే ధ్యేయం కావాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. పీఎం జన్‌మాన్ కార్యక్రమంపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ అభివృద్ధి సూచికలు గణనీయంగా మార్పు చెందాల్సిన అవసరం ఉందన్నారు. తాగునీరు, విద్య, ఆరోగ్యం, గృహాల కల్పన శతశాతం లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ జీవన ప్రమాణాలలో మంచి మార్పులు రావాలని చెప్పారు. అందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కుటుంబం యూనిట్‌గా ప్రణాళికలు ఉండాలని పేర్కొన్నారు. జన్‌మాన్ కార్యక్రమాన్ని పెద్దఎత్తున ఉపయోగించుకోవాలని సూచించారు. రహదారులు అనుసంధానం కాని గిరిజన ఆవాసాలకు రహదారుల నిర్మాణానికి సమగ్ర అంచనాలతో ప్రతిపాదనలు సమర్పించాలని పంచాయతీరాజ్ ఇంజినీర్లను ఆదేశించారు. ప్రతి గ్రామానికి సంబంధించి పూర్తి వివరాలు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో అవసరం ఉన్న వసతిగృహాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వారం రోజుల్లో సమర్పించాలని ఐటీడీఏ అధికారులను ఆదేశించారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో నిర్మిస్తున్న ఏడు బహుళార్థక వినియోగ సామాజిక భవనాలు డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని చెప్పారు. మొబైల్ టవర్లను నెల రోజుల్లో పూర్తి చేయాలన్నారు. జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎంవీఆర్ కృష్ణాజి మాట్లాడుతూ వందకు పైగా జనాభా కలిగిన 43 ఆవాసాలకు 38.65 కిలోమీటర్ల మేర 19 అనుసంధాన రహదారులు మంజూరు చేసినట్లు తెలిపారు. పరిపాలన అనుమతులు మంజూరు కావలసి ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్, పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు అధికారి ఎస్ఎస్ శోభిక, సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు అధికారి వి.వెంకట రమణ, ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో తనిఖీలు నిర్వహించాలి

జిల్లాలోని అన్ని వసతిగృహాలు, చిన్నారుల సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేయాలని, వసతులు, వాటికి అనుమతులు ఉన్నది, లేనిది పరిశీలించాలని, అనుమతులు లేని వాటిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతిగృహాలు తనిఖీ చేసి అనుమతులు పరిశీలించి, తనిఖీలపై మండలాల వారీగా నివేదిక అందజేయాలని కోరారు. అనుమతులు లేకుండా ఎక్కడైనా వసతిగృహాలు, సంరక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లయితే వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అందులో ఉన్న పిల్లలను ప్రభుత్వ వసతిగృహాలకు తరలించాలని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా వసతిగృహాలు, సంరక్షణ కేంద్రాలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేయాలని చెప్పారు. మండల అభివృద్ధి అధికారులు, బీసీ, సోషల్ వెల్ఫేర్ అధికారులు వెంటనే అన్ని హాస్టల్స్‌ను తనిఖీలు చేసి రిపోర్టు అందజేయాలని ఆదేశించారు. వార్డెన్లు వసతిగృహంలో ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, వసతిగృహాల్లో నాణ్యతతో కూడిన, తాజా ఆహారాన్ని అందించాలని, అనుమతి లేకుండా బయటివారు అందించే ఆహారపదార్థాలు స్వీకరించకూడదని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి గయాజుద్దీన్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఎస్.కృష్ణ, ట్రైబల్ వెల్ఫేర్ ఉపసంచాలకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయం చేయాలి

• జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్



వరి సాగును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్

సాలూరు రూరల్: ప్రతి రైతు కనీసం ఒక ఎకరా భూమిలో సేంద్రియ వ్యవసాయం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన సాలూరు మండలంలో క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా బంగారమ్మ కాలనీలో కొట్యాడ శ్రీనివాసరావు వేసిన ఆర్‌జీఎల్ 7034 మినీ కిట్ వరి ప్రదర్శన క్షేత్రాన్ని సందర్శించారు. ఈ వెరైటీ సాంబమసూరి కన్నా 10 రోజులు ముందుగా కోతకు వస్తుందని చెప్పారు. అనంతరం మండలంలోని అన్నంరాజువలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల ఏటీఎం మోడల్‌ఫీల్డ్‌ను చూశారు. మామిడిపల్లి రైతు సేవా కేంద్రంలో మూడు మండలాల ఏపీసీఎన్ఎఫ్ సిబ్బందితో సమావేశమై మాట్లాడుతూ ప్రతి రైతు కనీసం ఒక్క ఎకరాలో సేంద్రియ వ్యవసాయం చేయాలని, సేంద్రియ వ్యవసాయంతో రైతుకు పెట్టుబడి తగ్గడంతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చని సూచించారు. అనంతరం సాలూరులో ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌లో విత్తన పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సాలూరు సబ్‌డివిజనల్ అధికారి మధుసూదన్ రావు, మండల వ్యవసాయ అధికారి అనూరాధ పండా, గ్రామ వ్యవసాయ సహాయకురాలు ప్రమీల పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి నిందితుల అరెస్ట్

• 22.7 కిలోల సరుకు సీజ్
• వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందాల్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్ (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: గంజాయి వాసన రాకుండా అగరబత్తీలు, కంఫర్ట్ లిక్విడ్‌ను వినియోగించి రవాణా చేసేందుకు ప్రయత్నించిన దుండగుల ప్రయత్నం బెడిసికొట్టింది. విజయనగరం రూరల్ పోలీసులు గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 22.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్ జిల్లాకు చెందిన మహమ్మద్ వసీం (ఎ1) తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో ఉండేవాడు. అక్కడి నుంచి ఏడాదిన్నర క్రితం విజయనగరానికి వలస వచ్చి ధర్మపురి పంచాయతీ పరిధిలోని వసంతవిహార్ లేఅవుట్‌లో ఒక విల్లాను అద్దెకు తీసుకుని ఉంటూ గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో చేసి, వేర్వేరు ప్రాంతాలకు రవాణా చేస్తున్నాడు. ఈ మేరకు కచ్చితమైన సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఇన్‌చార్జ్ సీఐ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం రైడ్ చేసి ఇంట్లో ఉన్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో వసీంతో పాటు బీహార్ రాష్ట్రంలోని కిషాన్ గంజ్ జిల్లా అల్తవాడ గ్రామానికి చెందిన ఇన్సోజ్ అలం (ఎ2), ఢిల్లీలోని జామియానగర్‌కు చెందిన రుక్సాయి కుర్షీద్ (ఎ3) అనే మహిళ ఉన్నారు. నిందితుల్లో ఇన్సోజ్ ఆలం, రుక్సాయి కుర్షీద్‌లు గంజాయిని ఢిల్లీ తీసుకు వెళ్లేందుకు విజయనగరం వచ్చినట్లు విచారణలో వెల్లడైంది. ఈ దాడిలో గంజాయితో పాటు ప్యాకింగ్ చేసేందుకు వినియోగించే కంఫర్ట్ లిక్విడ్, అగరబత్తీలను పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు, ఇతర రాష్ట్రాల వారికి ఇళ్లను అద్దెకు ఇచ్చేముందు వారి పూర్వాపరాలు తెలుసుకోవాలని, వారు ఇంటిని ఎందుకు వినియోగిస్తున్నదీ పూర్తిగా తెలుసుకున్న తర్వాతనే అద్దెకు ఇవ్వాలని ఎస్పీ వకుల్ జిందాల్ పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, భోగాపురం సీఐ జి.రామకృష్ణ, ఎస్బీ సీఐ కేకేవీ.విజయనాథ్, రూరల్ ఎస్సైలు ఆర్.వాసుదేవ్, శ్యామల, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

31న గర్భాశయ కేన్సర్ నివారణకు వ్యాక్సినేషన్

• రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ప్రసాద్‌రావు

విజయనగరం ఫోర్ట్: ఈనెల 31న స్థానిక పేర్లవారి వీధిలో ఉన్న సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ ఆఫ్ చెవిటి, మూగ పాఠశాలలో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్, గర్భాశయ కేన్సర్‌ను నివారించేందుకు వ్యాక్సినేషన్ వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాద రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు 9 నుంచి 14 ఏళ్ల మధ్య ఉన్న బాలికలకు గర్భాశయ కేన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్ కూడా నిర్వహించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అమెరికాలోని బోస్టన్ నగరానికి చెందిన మానవ సేవ స్వచ్ఛంద సంస్థ సహకారం అందిస్తోందని వివరించారు.

పైడితల్లి పండగ తేదీలు ఖరారు

• సెప్టెంబర్ 20 నుంచి మండల దీక్షలు, పందిరిరాటతో ప్రారంభం
• అక్టోబర్ 14న తొలేళ్ల ఉత్సవం, 15న సిరిమానోత్సవం
• ఉత్సవ వివరాలు వెల్లడించిన ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు



మీడియాతో మాట్లాడుతున్న ఆలయ ఈఓ ప్రసాదరావు, పక్కనే సిరిమాను పూజారి వెంకటరావు

విజయనగరం టౌన్: పసిడి తల్లి.. ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి పండగ వస్తుందంటే అందరికీ ఆనందమే. ఆ తల్లి కరుణా కటాక్ష వీక్షణాల కోసం భక్తులు వేచిచూస్తుంటారు. సిరిమాను పూజారి రూపంలో దర్శనమిచ్చిన తల్లి ఆశీస్సులు పొందాలని ఆశపడతారు. జీవితంలో ఒక్కసారైనా అమ్మ జాతరను చూడాలని పరితపిస్తుంటారు. అంతటి ప్రాశస్త్యం కలిగిన పైడితల్లి నెలరోజుల పండగ తేదీలు ఖరారయ్యాయి. గత ప్రభుత్వం 2019లో అమ్మవారి పండగను రాష్ట్ర పండగగా గుర్తిస్తూ ఐదేళ్ల నిర్వహించింది. అదే రీతిన ఈ ఏడాది కూడా పండగ నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. పైడితల్లి అమ్మవారి ఆలయం వెనుక ఉన్న కార్యాలయంలో ఈ ఏడాది పైడితల్లి జాతర వివరాలను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు మంగళవారం సాయంత్రం మీడియాకు వెల్లడించారు. ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు.

ఉత్సవ తేదీలు ఇలా...

సెప్టెంబర్ 20వ తేదీ నుంచి అక్టోబర్ 30 వరకూ ఉత్సవాలు జరగనున్నవి. సెప్టెంబర్ 20న భాద్రపద బహుళ తదియ శుక్రవారం మండల దీక్షలు చదురుగుడి వద్ద ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయి. అదేరోజు చదురుగుడి ఆవరణలో 9.30 గంటలకు, వనంగుడి ఆవరణలో ఉదయం 11 గంటలకు పందిరిరాట వేసి ఉత్సవాలు ప్రారంభిస్తారు. అక్టోబర్ 10న గురువారం అర్ధమండల దీక్షలు నిర్వహిస్తారు. అక్టోబర్ 14న సోమవారం తొలేళ్ల ఉత్సవం, 15న మంగళవారం సిరిమాను ఉత్సవం, 22న మంగళవారం పెద్దచెరువులో అమ్మవారి తెప్పోత్సవం, 27న ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు రైల్వేస్టేషన్ వద్ద వనంగుడి నుంచి అమ్మవారి కలశ జ్యోతుల ఊరేగింపు ఉంటుంది. అక్టోబర్ 29న మంగళవారం చదురుగుడి వద్ద ఉయ్యాల కంబాల మహోత్సవం, 30న బుధవారం వనంగుడి ఆవరణలో చండీహోమం, పూర్ణాహుతి, దీక్షా విరమణలు ఉదయం 8 గంటల నుంచి సాగుతాయి. సిరిమానోత్సవంలో భాగంగా ప్రభుత్వంతో పాటు టీటీడీ నుంచి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని ఈఓ తెలిపారు. ఉత్సవ తేదీలను ఆలయ అనువంశిక ధర్మకర్త, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌లకు ఇప్పటికే తెలియజేశామన్నారు. ప్రభుత్వం తరపున ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరామన్నారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు మాట్లాడుతూ పైడితల్లి జాతరను భక్తులందరూ విజయవంతం చేయాలని కోరారు.

మళ్లీ చదువుకుందాం..!

• దూర విద్యావిధానంలో అడ్మిషన్లు ప్రారంభం
• టెన్త్, ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశం
• సెలవు రోజుల్లోనే తరగతులు



గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దూర విద్య విధానంలో టెన్త్ చదువుతున్న వారు (ఫైల్)

గుమ్మలక్ష్మీపురం: చదువుకోవాలనే తపన ఉన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల చదువుకు దూరమైన వారు మళ్లీ చదువుకునేందుకు ఏపీ సార్వత్రిక విద్యా పీఠం (దూర విద్యావిధానం) మళ్లీ చదువుకుందాం ..రా..అంటూ ఆహ్వానిస్తోంది. అందుకోసం అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుకోవాలనే వారు ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకుని విద్యావంతులయ్యేందుకు అవకాశం ఏర్పడింది.

పదో తరగతిలో ప్రవేశాలకు అర్హతలు

• 14 సంవత్సరాలు నిండి చదవగలిగి, రాయగలిగిన పరిజ్ఞానం కలవారందరూ అర్హులే.
• పదవ తరగతి ఫెయిల్ అయిన వారు, బడి మధ్యలో మానివేసి 14 సంవత్సరాలు నిండిన వారికి పదవ తరగతి చదువుకునేందుకు సువర్ణ అవకాశం.

ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు అర్హతలు

15 సంవత్సరాలు నిండి పదవ తరగతి పూర్తయిన వారందరూ ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశం.
☛ ఇంటర్మీడియట్ మానివేసిన వారికి, ఫెయిల్ అయిన వారికి మళ్లీ చదువుకునే అవకాశం.

లభించే వెసులుబాటు

✔ సరళమైన సార్వత్రిక విద్యా విధానం
✔ మహిళలు, పలు వృత్తి, వ్యాపార రంగాల్లో ఉన్న వారు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల సభ్యులు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి ఒక సదవకాశం.
సెలవు రోజుల్లో మాత్రమే తరగతులు నిర్వహిస్తారు.

ఇష్టమైన ఏవైనా 5 సబ్జెక్టులతో కోర్సు పూర్తి చేయవచ్చు.

✍ ఉచిత పాఠ్యపుస్తకాలు లేక సులభమైన స్వీయ అభ్యసన సామగ్రి ఇంటికే పంపిస్తారు.
✍ జ్ఞానధార యూ ట్యూబ్ చానల్, apopenrchoo.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా కంటెంట్‌ను పొందవచ్చు.
✍ పాఠశాలలో పదో తరగతి, కళాశాలలో ఇంటర్మీడియట్ కోర్సుల్లో ఫెయిల్ అయినప్పటికీ పాసైన రెండు సబ్జెక్టుల మార్కులు బదలాయించుకునే అవకాశం.
✍ మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, మాజీ సైనికోద్యోగులకు అడ్మిషన్ ఫీజులో రాయితీ.
✍ అభ్యాసకులు ప్రవేశం పొందిన నాటి నుంచి 5 సంవత్సరాల వరకు 9 పర్యాయాలు పబ్లిక్ పరీక్షలకు హాజరుకావచ్చు.

ప్రవేశ విధానం

ఇంటర్నెట్ సెంటర్లు, ఏపీ ఆన్‌లైన్ సెంటర్లు లేదా గ్రామ, వార్డు సచివాయాల ద్వారా ఆన్‌లైన్‌లో ప్రవేశం పొందవచ్చు.

పది కేంద్రాలు

సార్వత్రిక విద్యా పీఠం ద్వారా విద్యాబోధన కార్యక్రమాలను పార్వతీపురం మన్యం జిల్లాలోని 10 కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. అవి పార్వతీపురం, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కురుపాం, మక్కువ, పాచిపెంట, బలిజిపేట, వీరఘట్టం, పాలకొండ మండల కేంద్రాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సార్వత్రిక విద్యా పీఠం సెంటర్లు ఉన్నాయి.

ప్రవేశాలకు గడువు

సార్వత్రిక విద్యా పీఠంలో ప్రవేశాలు జూలై 31 నుంచి ప్రారంభమవ్వగా ఈనెల 27వ తేదీ ఆన్‌లైన్ అప్లికేషన్ ఫారం సమర్పించేందుకు చివరి రోజు. కాగా నిర్ణీత అడ్మిషన్ ఫీజు మరియు రూ.200 అపరాధ రుసుముతో చెల్లించేందుకు ఈనెల 28వ తేదీ చివరి రోజు. అంతే కాకుండా ఆన్‌లైన్ అప్లికేషన్ ఫారం సమర్పించేందుకు నిర్ణీత అడ్మిషన్ ఫీజు, అపరాధ రుసుముతో చెల్లించేందుకు చివరి తేదీ సెప్టెంబర్ 4 వరకు అవకాశం కల్పించారు.

సార్వత్రిక విద్యాపీఠం సేవలను వినియోగించుకోవాలి



సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుకునేందుకు చక్కని అవకాశం లభించింది. చదువు పట్ల ఆసక్తి ఉన్నవారు, పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న చిరుద్యోగులు, గృహిణులు, వ్యాపారాల్లో రాణిస్తున్న వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–ఎం.సుధాకర్, సార్వత్రిక విద్యాపీఠం జిల్లా కో ఆర్డినేటర్, పార్వతీపురం మన్యం జిల్లా

హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడి అరెస్టు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి జంక్షన్‌లో ఈ నెల 18న జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేశామని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. పట్టణ పరిధి మల్లికార్జున కాలనీకి చెందిన పడాల శేఖర్‌పై గొల్లవీధికి చెందిన నాగళ్ల గణేష్ దాడికి పాల్పడిన విషయం విదితమే. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టుచేసి శ్రీకాకుళం ఎస్సీ, ఎస్టీ కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు డీఎస్పీ చెప్పారు.

హజ్ యాత్రకు దరఖాస్తులు

విజయనగరం టౌన్: పవిత్ర హజ్ యాత్రకోసం హజ్ కమిటీ ఆఫ్ ఇండియా–2025కు ఆన్‌లైన్ ద్వారా సెప్టెంబరు 9లోపు దరఖాస్తు చేసుకోవాలని హజ్ కమిటీ నిర్ణయించినట్లు జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి డాక్టర్ ఆర్ఎస్.జాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి చెందిన హజ్ యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్ణీత గడువు ప్రకారం హజ్ యాత్ర కోసం దరఖాస్తు చేసుకోవాలని, ప్రతి యాత్రికుడు తన మెషిన్ రీడబుల్ ఇండియన్ ఇంటర్నేషనల్ పాస్‌పోర్ట్ వ్యాలిడిటీ, హజ్ దరఖాస్తు ముగింపు తేదీకి ముందే జారీచేసి ఉండాలన్నారు. 2026 జనవరి 15వరకూ చెల్లుబాటయ్యేలా చూసుకోవాలని సూచించారు. హజ్‌యాత్రకు ఎంపికైన యాత్రికులు మెడికల్ స్క్రీనింగ్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ప్రత్యేక హజ్ సువిధ యాప్‌ను ప్రారంభించిందని, అన్ని సౌకర్యాలను సులభతరం చేసేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. 'హజ్‌కమిటీ డాట్ జీఓవీ డాట్ ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 0866–2471786 నంబర్‌ను కానీ టోల్ ఫ్రీ నంబర్ 1800–4257873ను సంప్రదించాలని తెలిపారు.

వాస్తవ వ్యవసాయ ప్రణాళిక అవసరం

• జేసీ సేతు మాధవన్



మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: వ్యవసాయ శాఖ ఐదేళ్ల ప్రణాళికను వాస్తవంగా చేయగలిగే లక్ష్యాలతో రూపొందించాలని సంయుక్త కలెక్టర్ సేతుమాధవన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత ఆంధ్ర 2047లో భాగంగా విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించేటప్పుడు సాధ్యాసాధ్యాలను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. రైతులకు ఉపయోగపడేలా ఉండాలని తెలిపారు. జిల్లా అభివృద్ధికి ఫసల్ బీమా యోజన పోర్టల్ నందు యాప్‌లను వినియోగించే విధానం, జిల్లా స్థాయి పంట కోత ప్రయోగాలకు చెందిన యాప్‌లు, పంట నష్టం అంచనా, పంటల బీమా, సమాచార హక్కు చట్టం, తదితర కార్యక్రమాలపై వ్యవసాయ అధికారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు, సీపీఓ బాలాజీ, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ, ఏడీలు, మండల వ్యవసాయ అధికారులు, ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

• ఉపాధ్యాయులకు డీఈఓ సూచన

సీతానగరం: పార్వతీపురం మన్యం జిల్లాలో టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధనకు ఉపాధ్యాయులంతా అంకితభావంతో కృషి చేయాలని డీఈఓ జి.పగడాలమ్మ స్పష్టం చేశారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని ఆర్.వెంకంపేట ఉన్నత పాఠశాలను ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ పగడాలమ్మ ఉపాధ్యాయులు అనుసరిస్తున్న విద్యాబోధన తీరును పరిశీలించి, నూతనంగా నిర్మించిన అదనపు భవనాలు, మరమ్మతులు చేసిన తరగతి గదులను తనిఖీ చేశారు. తరువాత పాఠశాలలో మౌలికవసతులు, మధ్యాహ్నభోజన వంటలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాలలో విద్యాబోధనపై సంతృప్తి వ్యక్తం చేశారు. 2024–25 విద్యా సంవత్సరంలో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యాపరంగా సబ్జెక్టుల వారీగా వెనుబడి ఉన్న విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని వారిని ముందు వరుసలోకి తేవాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.